క్లుప్తంగా

సొసైటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వీరబాబు, సభ్యులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక సొసైటీ చైర్మన్‌గా అప్పన వీరబాబు, సభ్యులుగా కుడుపూడి వెంకటేశ్వరరావు, ఇంజేటి నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు మాట్లాడుతూ, సొసైటీ ద్వారా రైతులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మద్దాల కృష్ణమూర్తి, పితాని వెంకటేశ్వరరావు, కోలా సత్తిబాబు, చెరుకూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ఎంఈఓ



అప్పనపల్లిలో స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

మామిడికుదురు: అప్పనపల్లి మండల పరిషత్ మోడల్ స్కూల్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. పిల్లల సామర్థ్యాలు, స్కూల్ పరిసరాలను గమనించారు. విద్యార్థులకు చక్కటి బోధన అందించాలన్నారు. సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నైనాల రఘురామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన ప్రధాన రహదారులు



మామిడికుదురులో జాతీయ రహదారిపై ముంపు నీరు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మామిడికుదురు మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షంతో పలు చోట్ల ప్రధాన రహదారులపై భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. మామిడికుదురు, నగరం గ్రామాల్లోని జాతీయ రహదారి కాలువను తలపించింది. మూడడుగులకు పైగా ముంపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెయిన్ రోడ్డు నుంచి ముస్లిం వీధికి వెళ్లే రోడ్లు సైతం ముంపు బారిన పడ్డాయి. మండలంలోని మిగిలిన గ్రామాల్లో గ్రామీణ రోడ్లపై సైతం వర్షం నీరు భారీగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్

మామిడికుదురు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తెలిపారు. మామిడికుదురు సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్‌ను ఆయన మంగళవారం కలిశారు. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శ్రీనివాస్‌ను సత్కరించారు. పీఆర్‌టీయూ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

అన్నదాన భవనానికి విరాళాలు



వాడపల్లి ఆలయంలో దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఈఓ

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన నందిన సతీష్, నందిన హర్షిప్ వారి కుటుంబసభ్యులు రూ 50,116, రావులపాలెనికి చెందిన పులవర్తి దుర్గ అనూష, వారి కుటుంబసభ్యులు రూ 31,485 విరాళంగా సమర్పించారు. వారు మంగళవారం స్వామి వారిని దర్శించుకున్నారు. దాతలకు ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఇలా వదిలిస్తే.. వేళ్లేదెలా!

- ప్రారంభం కాని రోడ్ల పునర్నిర్మాణం
- ప్రాణ సంకటంగా ప్రధాన రహదారులు
- మరింత జఠిలంగా ప్రయాణాలు

మలికిపురం: అధికారంలోకి వస్తే రోడ్లన్నీ మరమ్మతులు చేస్తాం. కొత్త రోడ్లు వేసి అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికారు. కానీ, అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలలు అవుతున్నా.. నియోజకవర్గంలోని ప్రధాన, మెయిన్ రోడ్ల అభివృద్ధి పనులు ఎక్కడ వేసి గొంగలి అక్కడే అన్న చందాన మారాయి. ఇంతటి అధ్వాన రోడ్లపై ప్రయాణం ఎలా చేయాలంటూ ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

అర్ధాంతరంగా వదిలేసిన పనులు

రాజోలు నియోజకవర్గంలో ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల అభివృద్ధి మాటను గాలికి వదిలేశారు. గత సంక్రాంతికి రోడ్లు వేసేస్తామంటూ రిపేరు చేసిన పలు రోడ్లు ప్రస్తుత వర్షాలకు కొట్టుకుపోయి గోతులు పడ్డాయి. ఈ గోతులలో వర్షపు నీరు నిలిచి జలాశయాలుగా మారాయి. నియోజకవర్గంలో ప్రధాన రహదారుల్లో ఒకటైన చింతలపల్లి- లక్కవరం రోడ్డు పూర్తిగా పాడైపోయింది. గత ఎన్నికల నాటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఫిబ్రవరిలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఈ రోడ్డు మంజూరు ఫైల్‌ను బయటకు తీసి పనులు ప్రారంభింపజేశారు. వెడల్పు చేసేందుకు రోడ్డు సైడ్ బెర్మ్‌లు తవ్వి వదిలేశారు. సుమారు రూ.2.50 కోట్లతో ఈ పనులు ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో అసలుకే ఎసరొచ్చి ప్రయాణం మరింత జఠిలమైంది.

పాడైపోయిన రోడ్లు ఇవే

నియోజకవర్గంలో పెరిగిన రవాణా అవసరాల నేపథ్యంలో సుమారు పది గ్రామాలకు విస్తరించి ఉన్న ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కానీ అభివృద్ధి మాత్రం శూన్యం. ఇటీవల చేసిన నామ మాత్రపు మరమ్మతులు వర్షాలకు పాడైపోయాయి. ఇక సముద్ర తీర ప్రాంతంలో వాణిజ్య అవసరాలతో పాటు ప్రజల దైనందిన కార్యక్రమాల రాకపోకలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం సముద్ర తీర ప్రాంత రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఇది పూర్తిగా పునర్నిర్మాణం చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. సఖినేటిపల్లి మండలంలో శృంగవరప్పాడు, ఉయ్యూరి వారి మెరక- శంకరయ్య గాదులు ఆర్ అండ్ బీ రోడ్డు కూడా ధ్వంసమైంది. రామరాజులంక- దిండి ఆర్ అండ్ బీ రోడ్డు, పెదతిప్ప రోడ్డు, మలికిపురం- రామరాజులంక ఏటిగట్టు రోడ్డు కూడా పూర్తిగా పాడైపోయింది. అదే విధంగా రామరాజులంక- అంతర్వేది వయా గుడిమూల రోడ్డు సమీపంలో అప్పనరామునిలంక, కొత్తలంక రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది. లక్కవరం- గూడపల్లి రోడ్డు, ములికిపల్లి- పొన్నమండ, కాత్రేనిపాడు, ముత్యాలపల్లి- గోగన్నమఠం రోడ్డు పూర్తిగా పాడైపోయి అధ్వానంగా ఉంది. గొల్లపాలెం వయా కాత్రేనిపాడు, మెరకపాలెం, ములికిపల్లి రోడ్డు మిక్కిలి అధ్వానంగా ఉంది. శంకరగుప్తం- బట్టేలంక రోడ్డు అభివృద్ధి గురించి మరిచిపోయారు. అధ్వాన్నంగా ఉన్న ఈ రోడ్లు ఎప్పటికి అభివృద్ధి చేస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



విశ్వేశ్వరాయపురంలో జలమయమైన ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు



చింతలపల్లి- లక్కవరం రోడ్డులో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు



అధ్వానంగా ఉన్న శంకరగుప్తం- బట్టేలంక రోడ్డు

అత్యంత ప్రమాదకరంగా..

చింతలపల్లి- లక్కవరం రోడ్డు మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు బస్సులు తిరిగే మార్గం. ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇటీవల ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు స్కూల్ బస్సులు, లారీలు అధ్వాన రోడ్డులో వెళ్తూ పక్కన ఉన్న కాలువలో బోల్తా పడి ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయాలు త్రుటిలో తప్పాయి. ఇక మలికిపురం నుంచి సఖినేటిపల్లి రేవు వరకూ ఉన్న కెఎస్ఎఫ్ రోడ్డు మిక్కిలి అధ్వానంగా ఉంది. ఇటీవల కేవలం గోతులు మాత్రమే పూడ్చారు. కానీ, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మళ్లీ కొత్త గోతులు ఏర్పడ్డాయి. ఇక అంతర్వేది పుణ్యక్షేత్రం నుంచి దండు పుంత మీదుగా వుయ్యూరి వారి మెరక, కత్తిమండ, చింతలపల్లి మీదుగా బి.సావరం, సోంపల్లి వరకూ ఉన్న 34 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది.

కాంట్రాక్టర్లతో చర్చలు జరుపుతున్నాం



నియోజకవర్గంలో శంకుస్థాపన చేసిన రోడ్ల పనులు ప్రారంభించేందుకు సదరు కాంట్రాక్టర్లతో చర్చలు జరుపుతున్నాం. బిల్లులు పెండింగ్ వల్ల ప్రస్తుతం కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ఆలస్యం చేస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం.

– రవి, ఆర్‌అండ్‌బీ డీఈ, రాజోలు.

రైస్‌మిల్లుల్లో డీఎం విచారణ

పి.గన్నవరం: స్థానిక రైసుమిల్లు యజమానిని ఇటీవల ఒక వ్యక్తి బెదిరించి రూ.1.5 లక్షలు కాజేశాడని వచ్చిన ఆరోపణలపై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం విచారణ నిర్వహించారు. మిల్లు యజమాని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రైసుమిల్లుల్లో బియ్యం నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఎస్‌ఓ ఎండీ ఇస్మాయిల్, పూర్ణిమ ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి రైతుల నుంచి 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. జిల్లాలో 1,56,505 ఎకరాల్లో వరి పంట వేశారన్నారు. దీనికి సంబంధించి 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారన్నారు. ఇంతవరకూ 75 శాతం ఈ-క్రాపు నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు.

మళ్లీ పెరిగిన వరద

అయినవిల్లి: ఎగువ కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉప్పొంగుతోంది. దీంతో మండలంలోని పల్లపు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. మండలంలోని ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వృద్ధగౌతమి పాయపై ఉన్న పాత వంతెన మునిగిపోయింది. వంతెనపై నాలుగు అడుగల మేర వరద నీరు ప్రవహిస్తుంది. ముక్తేశ్వరం- కోటిపల్లి రేవులో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. వృద్ధగౌతమి పాయకు అనుకున్న శ్మశాన వాటిక పూర్తిగా మునిగింది. అలాగే ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వద్ద రహదారికి అనుకొని వరద చుట్టుముట్టింది.

మునిగిన కాలనీలు

అయినవిల్లి: భారీ వర్షానికి మండలంలోని పలు లోతట్టు కాలనీలు ముంపునకు గురయ్యాయి. కాలనీలలో డ్రైన్ల వ్యవస్థ లేకపోవడం వల్ల ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. చింతనలంక, మడుపల్లి, సిరిపల్లి, అయినవిల్లి, విలస, తొత్తరమూడి, శానపల్లిలంక, ఎస్.మూలపాలెం, కె.జగన్నాథపురం, మాగం, పోతుకుర్రు, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి కాలనీల్లో ముంపు నీరు ఎప్పటి కప్పుడు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.



ముక్తేశ్వరం వద్ద వృద్ధగౌతమి పాయలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

నాలుగోసారి మునిగిన కాజ్‌వే

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం గ్రామానికి సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కనకాయలంక కాజ్‌వే ఈ ఏడాది నాలుగోసారి నీట మునిగింది. మంగళవారం రాత్రి కాజ్‌వేపై రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు, కనకాయలంక గ్రామాల ప్రజలు వరదలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆ గ్రామాల ప్రజలు రెండు నెలలుగా పడవలపై ప్రయాణిస్తున్నారు. అలాగే జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, అనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.



వరద ఉధృతిలో కనకాయలంక కాజ్‌వేను దాటుతున్న ప్రజలు

19న చలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 19న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన చలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మంగళవారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విద్యార్థి, యువజన విభాగాలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను 19న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, యువత సందర్శించి కూటమి ప్రైవేటీకరణ విధానాలపై ఆందోళన చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, అందుకు సిద్ధంగా పార్టీ శ్రేణులు ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు తాడి సహదేవ్, నాయకులు మోకా సురేష్, కుసుమ చంద్రశేఖర్, దొంగ ఏసు, తోటి జాన్ బాబు, కొల్లాబత్తుల సతీష్ పాల్గొన్నారు.

రణభేరి వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం యూటీఎఫ్ చేపట్టిన రణభేరి వాల్ పోస్టర్లను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలపై పోరాడుతున్నట్టు సదరు సంఘ మండల గౌరవాధ్యక్షుడు గొల్లమందల రాజబాబు పేర్కొన్నారు. ఈ మేరకు బకాయిలపై పోరాడుతున్న తమకు మద్దతు ఇవ్వాలని టీచర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. సంఘ సభ్యులు నాగేశ్వరరావు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



రణభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

వాడపల్లి క్షేత్రంలో గ్రామోత్సవం

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా సాగింది. వైష్ణవ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, వివిధ సేవలను కనుల వైకుంఠంగా నిర్వహించారు. భక్తులు కనులారా తిలకించి తన్మయత్వం చెందారు. అనంతరం కోలాహలంగా ఉట్లోత్సవం నిర్వహించారు.



వాడపల్లి క్షేత్రంలో వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

రాజోలు: ఓజోన్ పొరను రక్షించడం అందరి బాధ్యత అని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సాయిబాబు అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఓజోన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ నుంచి గ్లోబల్ యాక్షన్ వరకు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఓజోన్ పొరకు నష్టం కలిగితే భూమిపై విపరీతమైన వేడి కలుగుతుందన్నారు. దీని ప్రభావం అన్ని జాతులపై పడుతుందన్నారు. చెట్లను నరకడం తగ్గించి మొక్కలను పెంచేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, డాక్టర్ సి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.వి.వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినాన్ని నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ, కాలుష్య కారక క్లోరోఫ్లోరో కార్బన్లను అత్యధికంగా విడుదల చేస్తూ ఓజోన్ పొరను నాశనం చేస్తున్న దేశాలను నియంత్రించడం, పర్యావరణ పరిరక్షణ కోసం నిధుల కేటాయింపు పెంచడం ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులతో క్లోరోఫ్లోరో కార్బన్‌ల వినియోగాన్ని తగ్గిద్దాం -ఓజోన్ పొరను కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మానవాళికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరను పరిరక్షించుకుందామని పాశర్లపూడి జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి సూచించారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తీసుకొచ్చిన గొడుగులతో ఓజోన్-3 చిహ్నంగా కూర్చొని చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సూరుమేను శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో హెచ్‌ఎం బి.చిరంజీవిరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

మలికిపురం: ఓజోన్ పొర అనేది అన్ని జీవులను రక్షించే సహజ కవచం, ఇది సూర్యుని హానికరమైన యూవీ కిరణాలను గ్రహించడం ద్వారా మనల్ని రక్షిస్తుందని మలికిపురం ఎంవీఎన్‌జేఎస్అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద మహని అన్నారు. కళాశాలలో జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ స్రవంతి, ఎమ్.సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




మామిడికుదురులో ఓజోన్ చిహ్నంతో ఆకట్టుకున్న విద్యార్థులు

కొత్తపేట: ఓజోన్ పొరను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజు మాట్లాడుతూ, ఓజోన్ పొర సూర్యుడి నుంచి వచ్చే ప్రమాదకరమైన అతి నీలలోహిత కిరణాలను అడ్డుకోవడం ద్వారా భూమి మీద ఉన్న సమస్త జీవరాసులను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడలి గ్రామాన్ని విభజన చేయవద్దని వినతి

రాజోలు: కపోతేశ్వరస్వామి కొలువుతీరిన కడలి గ్రామాన్ని విభజన చేయవద్దని కోరుతూ గ్రామస్తులు మంగళవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో కొన్ని వ్యతిరేక శక్తులు వ్యక్తిగత స్వార్థాల కోసం గ్రామాన్ని ముక్కలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అతి పెద్ద మేజర్ పంచాయతీగా ఉన్న కడలి గ్రామం నుంచి గతంలో వేగివారిపాలెం, చెన్నడం గ్రామాలు వేరు పడ్డాయన్నారు. ప్రస్తుతం మధ్యస్థాయి పంచాయతీగా ఉన్న గ్రామాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేస్తే ఐక్యత దెబ్బతింటుందన్నారు. ఎస్సీలు, బీసీలు అధిక సంఖ్యలో ఉండే గ్రామంలో విభజన చేసి స్వార్థపూరిత ఆలోచన చేస్తున్నారన్నారు. సర్పంచ్ చొప్పల గుణనాథ్, యల్లమెల్లి ఆనందరాజు, కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.

ఎంఈఓ-2గా బాధ్యతల స్వీకరణ



ఎస్.రాజు

ఆలమూరు: మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎస్.రాజు ఎంఈఓ-2గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంఈఓ-2గా పనిచేసిన సుబ్బరాజు మూడు నెలల క్రితం పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు అప్పటి నుంచి ఖాళీగా ఉంది. ప్రస్తుతం నర్సిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజు పదోన్నతిపై ఎంఈఓ-2గా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

మామిడికుదురు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అప్పనపల్లి మండల పరిషత్ మోడల్ స్కూల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నైనాల రఘురామయ్య పేర్కొన్నారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో హెచ్‌ఎం స్వచ్ఛతా ప్రమాణం చేయించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలని, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దిరాజు, రామకృష్ణ, షబ్బీర్ హుస్సేన్, అనంతలక్ష్మీదేవి పాల్గొన్నారు.

బాలాజీ సన్నిధిలో ఓఎన్జీసీ డీడీ

మామిడికుదురు: ఓఎన్జీసీ డిప్యూటీ డైరెక్టర్ డీఆర్ కణ్ణన్ మంగళవారం అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కణ్ణన్ పేరిట స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు డీడీకి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

మలికిపురం: సముద్ర తీరంలో ఉప్పునీటి ప్రభావానికి చనిపోయిన కొబ్బరి తోటల రైతులు ఆదుకుని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మంగళవారం మండలంలోని కేశనపల్లి, గూడపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి రైతుల సమస్యలను విన్నారు. రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ సమస్య చాలా తీవ్రంగా ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం చింతలమోరిలో ఎఫ్‌సీఐ మెంబరు దొడ్డా నాగబాబు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో పేద వృద్ధులకు దుప్పట్లు అందించారు.

అన్నదాన పథకానికి విరాళం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ- గోపాలస్వామి ఆలయంలోని అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌కు చెందిన మొదలి రామకష్ణశర్మ జ్ఞాపకార్థం లక్ష్మీరామ్ రూ 10,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరఫున అధికారులు, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాలను అందజేశారు.

విజిలెన్స్ వీక్‌పై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఏపీ గ్రామీణ బ్యాంక్, అంతర్వేదిపాలెం బ్రాంచ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ సుధీర్ కుమార్ అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా బ్యాంక్ ఏలూరు రీజినల్ మేనేజర్ యూ.శ్రీదేవి, విజిలెన్స్ ఆఫీసర్ రాంబాబు పాల్గొన్నారు. అనంతరం స్పోర్ట్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

మలికిపురం: మండలంలోని మేడిచర్ల పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎర్రమిల్లి జయరాం ఆధ్వర్యంలో రాజ్ కమల్ ఫౌండేషన్ ద్వారా గణిత అవధాని సూర్యనారాయణ మూర్తి స్టడీ మెటీరియల్ సమకూర్చారు. పాఠశాలలో ప్రతిభావంతులైన 15 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మేడిచర్ల మల్లీశ్వరి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోనసీమ కన్స్యూమర్ ఫెడరేషన్ (కోకో ఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి అన్నారు. కె.పెదపూడి జోసెఫ్ మినిస్ట్రీ ఆవరణలో ఈతకోట సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అమలాపురం కిమ్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో కంటి, ఆర్థోపెడిక్, షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శ



నందయ్యను పరామర్శిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న స్థానిక చింతపల్లివారిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త చింతపల్లి నందయ్యను నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. నందయ్య కిడ్నీ సమస్యపై కాకినాడలో చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. ఆయన్ను పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, చింతపల్లి నర్సింహమూర్తి, పుచ్చకాయల నర్సింహమూర్తి, తాటికాయల మధు తదితరులు ఉన్నారు.